క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూ పోలీసు స్టేషన్, పలివేల్పుల, సీఆర్పీఎఫ్ క్యాంప్, టీబీ ఆస్పత్రి, మహాత్మా నగర్, విజయగణపతి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెడ్డి కాలనీ, యాదవనగర్, ఏకశిల కళాశాల, డబ్బాలు, హనుమాన్ నగర్, గోపాల్‌రావు బిల్డింగ్, కొత్తూరు మార్కెట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, గుండ్ల సింగారంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మడికొండలో ఉదయం 10 నుంచి 11.30 వరకు, న్యూశాయంపేట, జీఎస్ఎం స్కూల్, జూపార్కు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, హంటర్ రోడ్డు, టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఇస్లామియా కళాశాల మెయిన్ రోడ్డు, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కేయూలో కాళోజీ జయంతి

కేయూ క్యాంపస్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని ఈనెల 9న ఉదయం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై అవగాహన

కేయూ క్యాంపస్: ఈనెల 9న ఉదయం కేయూ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో కాకతీయ యూనివర్సిటీలోని ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెల్ నోడల్ అధికారి ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కాజీపేట: అతిగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఫాతిమా చిన్నప్ప 2రోజుల జైలుశిక్షను ఖరారు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో అర్షం చిరంజీవి, రాగి వెంకన్న, పెంచల రవి, చిందం ప్రభాకర్, వినోద్‌కుమార్ సాయిని మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని కోర్టులో సోమవారం హాజరుపర్చగా వారికి న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. తనిఖీల్లో ఎస్సైలు కనకచంద్రం, సంపత్, శ్రావణ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



ఖిలా వరంగల్: వరంగల్ 35వ డివిజన్ మైసయ్యనగర్‌కు చెందిన నిరుపేద విద్యార్థి కొంగ అరుష్ కుటుంబాన్ని వ్యాక్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ సోమవారం పరామర్శించారు. ఈ మేరకు ఆ విద్యార్థి చదువు నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. ఐటీ సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్, ఎండీ.రఫీ, రజనీష్, వైట్ల గణేష్ పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులకు సోమవారం యూనిఫాంలు పంపిణీ చేశారు. రిటైర్డ్ అధ్యాపకుడు మేకల పరశురాములు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె శశికాంత దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హనుమకొండ డీఐఈఓ గోపాల్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సన్యాసి శ్రీనివాస్, రిటైర్డ్ లెక్చరర్ మేకల కృష్ణ, మేకల విష్ణుకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'నాపా' సదస్సుకు ఆడెపు రవీందర్

రామన్నపేట: ఈనెల 20 నుంచి అమెరికాలోని వర్జీనియాలో జరగనున్న నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ (నాపా) 12వ వార్షిక సదస్సుకు వరంగల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్‌ను గౌరవ అతిథిగా ఆహ్వానిస్తున్నట్లు నాపా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ సాయిని, శ్రీశ్రీ చెరుపల్లి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అభివృద్ధికి చేపడుతున్న సేవలను గుర్తించి రవీందర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా తీగలు

- పట్టించుకోని అధికారులు
- విద్యుత్ స్తంభాలను చుట్టేస్తున్న కేబుళ్లు
- మరమ్మతులు చేసేందుకు అవస్థలు పడుతున్న ఉద్యోగులు

కాజీపేట: కాజీపేట పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లను ఇష్టారాజ్యంగా చుట్టేయడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభాలకు ఆ శాఖకు చెందిన తీగలు తప్ప.. ఇతరత్రా ఎలాంటి వైర్లు జతచేయకూడదు. స్తంభాల నుంచి ఇళ్లకు తీసుకుంటున్న విద్యుత్ కనెక్షన్లే గజిబిజిగా ఉండగా, వాటికి వివిధ ప్రైవేట్ సంస్థలకు చెందిన వైర్లు జతకడుతున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా భయంకరంగా వేలాగుతూ ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా కేబుళ్ల నిర్వాహకులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

సమస్య వస్తే సరిచేయలేక..

సాంకేతిక ఇబ్బందులు తలెత్తినప్పుడు స్తంభాలు ఎక్కేందుకు ఒప్పంద కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధులు నిర్వర్తించే క్రమంలో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సందర్భాలున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకైన వీధులు కావడంతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనాలు సైతం వచ్చే పరిస్థితి ఉండదు. కొన్ని స్తంభాలు ఇళ్లను ఆనుకొని ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి చెల్లింపులు చేయకుండా స్తంభాలను ప్రైవేట్ కేబుళ్ల నిర్వాహకులు ఎలా ఉపయోగించుకుంటున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాజీపేటలో విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు

మూఢ నమ్మకాలను నిర్మూలించాలి

- జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి భిక్షపతి
- కేయూలో రాత్రి చంద్రగ్రహణం వీక్షణం



చంద్రగ్రహణాన్ని వీక్షిస్తున్న జనవిజ్ఞాన బాధ్యులు

కేయూ క్యాంపస్: మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కార్యదర్శి రామంచ భిక్షపతి డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో గెస్ట్ హౌస్, మొదటి గేట్ వద్ద యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు, పరిశోధకులు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన టెలిస్కోప్ ద్వారా సంపూర్ణ చంద్రగ్రహణాన్ని విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మూఢ నమ్మకాలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఆకాశంలో చంద్రగ్రహణం ఒక అద్భుతమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు వేల్పుల రాజు, అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్, డాక్టర్ నవీన్, డాక్టర్ రౌతు అజయ్, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు తిరుపతి, బొట్ల మనోహర్, కామగోని శ్రవణ్, మంద శ్రీకాంత్, మద్రి మహేష్, ఎల్తూరి సాయికుమార్, నాస్తిక్ శివ, చిరంజీవి, జస్వంత్, సాయికుమార్, ప్రవర్తన్, రోనాల్డ్, రమేష్, తిరుపతి, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

న్యూశాయంపేట: కేంద్రంలోని మోదీ పాలనలో వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు అన్నారు. ఈ మేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశసంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, వ్యవసాయ ఉత్పత్తుల్లో కీలకపాత్ర పోషిస్తున్న వ్యవసాయ కూలీల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారదకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిలువేరు విజయ, ప్రభాకర్, సాయిలు, ఐలయ్య, ఆనందం, పుష్ప, బాబు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

విద్యారణ్యపురి: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ హెచ్ఎం జగన్, ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. చైల్డ్ సేఫ్టీ అండ్ యాంటీ ట్రాఫికింగ్ అనే అంశంపై పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ రిసోర్స్ పర్సన్ భార్గవి, డీఎల్ఎంటీ రఘు, ప్రజ్వల సంస్థ ప్రతినిధి భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంలో 'ముచ్చర్ల'కు ప్రత్యేక గుర్తింపు



నేత్రదాతల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు, తదితరులు

- డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

హసన్‌పర్తి: నేత్రదానంలో ముచ్చర్లకు ప్రత్యేక గుర్తింపు ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య కొనియాడారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముచ్చర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే నేత్రదానంలో ముచ్చర్ల ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ శరీర, అవయవ దానాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తౌలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేత్రదానం చేసిన 56మంది కుటుంబాల సభ్యులను సన్మానించారు. నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణకుమారి, డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ హరిదేవరాజ్, సభ్యులు బోగి సుజాత, పద్మ, రవీందర్, నర్సింహారాములు, జనార్దన్ రెడ్డి, కేదారి, రాజమణి, సాయిరెడ్డి, యోగా మాస్టర్ భాస్కర్, సాంబయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

పించన్లు పెంచి ఇవ్వాలని ధర్నా

న్యూశాయంపేట: ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడి కార్మికులకు ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చలో కలెక్టరేట్ పిలుపులో భాగంగా ఏకశిల పార్కు నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నేత, బీడి కార్మికులకు రూ.4 వేల పింఛన్ అందజేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, తదితరులు

నాణ్యమైన భోజనం అందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ

కాజీపేట అర్బన్: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ మనోజ్‌కుమార్ ఆదేశించారు. కాజీపేట మండలం అయోధ్యపురంలోని ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చిస్తానని ఎంఈఓ తెలిపారు.

ఏడోరోజుకు జాతీయ సమైక్యత శిబిరం

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నెంబర్కర్ వీర్ చక్ర పర్యవేక్షణలో నిర్వహిస్తున్న (ఏక్ భారత్ శ్రేష్ఠ) ఎన్‌సీసీ జాతీయ సమైక్యత శిబిరం సోమవారం ఏడో రోజుకు చేరింది. ఈ శిబిరంలో బిహార్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ కేడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీటీసీ ఆడిటోరియంలో ఎన్‌సీసీ కేడెట్ల మధ్య సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఒకరి సంస్కృతి మరొకరు గౌరవిస్తూ కేడెట్లు ప్రదర్శించిన నృత్యాలు, గ్రూప్ డ్యాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కల్నల్ రవి సునారే, క్యాంపు కెప్టెన్ ఎం.సదానందం, వెంకటేష్, జయరాం సింగ్, సంతోష్, దీపక్, అరుణ, కుమారస్వామి, మహేష్, సతీష్, దత్తు, ప్రవీణ్, నిఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హసన్‌పర్తి: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రహీంకు సోమవారం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో గురు పూజోత్సవం



సౌదీ అరేబియాలో తెలుగు భాషా దినోత్సవంలో సాటా సభ్యులు

హన్మకొండ చౌరస్తా: సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌదీ అరేబియా, రియాద్ నగరంలోని సక్సెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రియాద్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్సెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ మసూద్ మాట్లాడుతూ దేశాన్ని విడిచినా తమ సంస్కృతిని మరిచిపోకుండా గురువులను పూజించడం గర్వంగా ఉందన్నారు. సాటా ఫౌండర్ మల్లేషం, అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నూరుద్దీన్, కమిటీ సభ్యులు సురేష్, నరేష్, లోకేష్, అహ్మద్, కోకిల, శార్వాణి, ప్రీతి, సౌదీలోని వివిధ ప్రాంతాల తెలుగు సంఘాల అధ్యక్షులు యాంబు, కాశీరాజు, జెడ్డా, అమ్జద్, ఈస్ట్రన్, స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నెల్లుట్ల రమాదేవికి అభినందనలు



హన్మకొండ: నెల్లుట్ల రమాదేవి రచించిన మనసు భాష, రమణీయం, మనసు మనసుకు మధ్య, చినుకులు, తల్లి వేరు, రమాయణం వంటి కవితలు, కథలు ఆమె రచనా శక్తికి, సాహిత్య నైపుణ్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి తెలిపారు. కాళోజీ సాహిత్య అవార్డుకు ఎంపికైన రమాదేవిని హనుమకొండలోని ఆమె నివాసగృహంలో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. సీఎం చేతుల మీదుగా ఈనెల 9న తెలుగు భాష దినోత్సవం సందర్భంగా రమాదేవి అవార్డు అందుకోనుండడం హర్షణీయమన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కాజీపేట / కాజీపేట రూరల్: రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాజీపేట రైల్వే లైన్‌పై నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి పనులను పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఎనిమిదేళ్లు గడుస్తున్నా పనులు ఇంకా నత్తనడకనే సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కారు ఉపేందర్, తొట్టె మల్లేశం, జంపాల రమేష్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాజీపేట: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శ్రీస్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు కాజీపేట చౌరస్తాలో సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు సీఎం ప్రత్యేక ఆదేశాలను జారీ చేయడాన్ని హర్షిస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్మికులు కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు కుంచం అయిలయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, సభ్యులు గుండు సత్యం, గడ్డం రాజు, తాళ్ల వీరస్వామి, మంద బాబు, రమణ, కుంచాల శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అర్చకులు సోమవారం రాత్రి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. సంపూర్ణ చంద్రగ్రహణం ముగిసిన అనంతరం ఉదయం ఆలయం తెరిచి వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం, మణి, రవి, తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఫిజియోథెరపీపై అవగాహన

కాజీపేట అర్బన్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో జయ నర్సింగ్ కళాశాల నర్సులకు ఫిజియోథెరపీపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనారోగ్యం బారిన పడిన రోగుల రిహబిలిటేషన్‌లో ఫిజియోథెరపీ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆస్పత్రి వైద్యులు అజయ్, మైనిక తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు ఫిజియోథెరపీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జయ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రియోబాల, అసోసియేట్ ప్రిన్సిపాల్ సుధారాణి పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయంలో సంప్రోక్షణ

మడికొండ: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మూసివేశారు. అనంతరం సోమవారం ఉదయం 9గంటలకు ఆలయంలో అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, విష్ణువర్ధన చార్యులు, సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

జాన్ మృతి తీరని ప్రజలకు లోటు

న్యూశాయంపేట: చెరువుల పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షుడు బి.జాన్ ఆకస్మిక మృతి ప్రజలకు తీరని లోటని చిన్న వడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. చెరువుల పరిరక్షణకు చివరి వరకు సైనికుడిలా పనిచేశారని కొనియాడారు. అంతకుముందు జాన్ చిత్రపటానికి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.వెంకటేశ్వర్లు, దయాకర్, నాగేష్, సుధాకర్, క్రాంతి, కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

గురుకుల అద్దె భవనాల్లో వసతులు కల్పించాలి

న్యూశాయంపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల అద్దె భవనాల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ సత్యశారదకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నరేష్, స్వేరోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కివీ విద్యార్థుల ప్రతిభ



ఖిలా వరంగల్: హనుమకొండలో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తాంగ్‌తా మార్షల్ ఆర్ట్స్ జూనియర్స్ చాంపియన్ -2025 పోటీల్లో కరీమాబాద్‌లోని కివీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి తెలిపారు. జె.లలిత, ఎస్.సాత్విక్, ఎండీ.సోనమ్, ఎండీ.సనమ్ బంగారు పతకాలు సాధించగా, ఎస్.వరణ్, ఇసాక్, టి.భవ్య, మాళవిక వెండి పతకాలు అందుకున్నట్లు వివరించారు. ఈ మేరకు వారిని పాఠశాలలో సన్మానించినట్లు తెలిపారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు

హసన్‌పర్తి: మండల ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నేతలు సోమవారం అభ్యంతరాలు తెలిపారు. అభ్యంతరాలపై హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట, జయగిరి, అన్నాసాగరం, మడిపల్లి, బైరాన్‌పల్లి, సిద్ధాపురం, సీతానాగారంల్లో నమోదైన స్థానికేతరుల ఓట్లను తొలగించాలని అధికారులకు నాయకులు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలోని కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ ఎం.ప్రశాంతి ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు పొందారు. ఈమేరకు వారిని కళాశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ఎంజీఎం: వర్ధన్నపేట ఆర్‌బీఎస్‌కే స్టాఫ్ టీం ఏలో పనిచేసే ఏఎన్ఎం గ్రేసమ్మ ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఫార్మసిస్ట్ అసోసియేషన్, ఏఎన్ఎం అసోసియేషన్, డీఈఐసీ స్టాఫ్, ఆప్తమాలిక్ ఆఫీసర్ ప్రసాద్ కలిసి రూ.1,04,800 ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇన్‌సెంటివ్స్, రీయింబర్స్‌మెంట్, హెల్త్ ఇన్సూరెన్స్, కారుణ్య నియామకాలు ఉండవని, ఈ క్రమంలో అసోసియేషన్ సభ్యులు కలిసి ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ నాగేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్, ఆర్‌బీఎస్‌కే వర్ధన్నపేట టీం బీఫార్మసీ అసోసియేషన్ బాధ్యురాలు డి.స్వాతి, శివ, ఆర్‌బీఎస్‌కే ఏఎన్ఎం బాధ్యురాలు ఎండీ సమీనా, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బాధ్యులు

వర్సిటీల సమస్యలు పట్టించుకోని పాలకవర్గాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న అబ్బాస్

కేయూ క్యాంపస్: ప్రభుత్వ యూనివర్సిటీల సమస్యలను పాలక వర్గాలు పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ ఆరోపించారు. కేయూలోని హ్యూమానిటీస్ భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలోని, రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు నిధులు ఇవ్వకుండా పాలక వర్గాలు మొండివైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ యూనివర్సిటీలను పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్, బిరెడ్డి జస్వంత్, జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, గడ్డం కృష్ణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్, బాధ్యులు కళ్యాణ్, ఇస్మాయిల్, పవన్‌కుమార్ మల్లేశ్, పూజ, శ్రావణి, శ్రీసాయి, రాధిక, అనూష తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు



హసన్‌పర్తి: యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. ఆదివారం రాత్రి హసన్‌పర్తిలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంతో పాటు ఫర్టిలైజర్ షాపులకు యూరియా విడుదల చేశారు. ఈ సారి హసన్‌పర్తి రైతు వేదిక వద్ద రైతులకు టోకెన్లు జారీ చేశారు. అయితే, సోమవారం తెల్లవారుజాము నుంచే రైతులు టోకెన్ల కోసం క్యూకట్టారు.

క్రిబ్కో యూరియా రాక

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్‌కు సోమవారం 1,323 మెట్రిక్ టన్నుల క్రిబ్కో కంపెనీ యూరియా వచ్చింది. దీంతో వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి రికార్డుల ప్రకారం యూరియాను పరిశీలించారు. వరంగల్ జిల్లాకు 213 మెట్రిక్ టన్నులు, హనుమకొండకు 280, ములుగుకు 160, జయశంకర్ భూపాలపల్లికి 220, జనగామకు 230, మహబూబాబాద్ జిల్లాకు 220 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారు. ఉదయం నుంచే లారీల్లో జిల్లా వారీగా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి వివరించారు.